మతం పుచ్చుకున్న
వీరయ్యలో మార్పు

★

# మతమా, బానిసత్వమా?

★ కొత్త భావయ్య చౌదరి ★

వీరాయ నిత్యమూ కూలినాలి చేస్తున్నా పొట్ట గడవడం లేదు. ఇంట్లో నలుగురుపిల్లలూ, భార్యా, తల్లీ నిత్యమూ గంజితాగే వాళ్ళున్నారు. తల్లి వృద్ధురాలు. పిల్లల పోషణతోటే భార్యకు సరిపోతున్నది. తీరికగా వున్నప్పుడు యే రోడ్డుమీదకో పోయి, కాగితపుల్లలు ఏరితెస్తే కుటుంబానికి వంటచెరకు కొరవలేకుండా పోతున్నది. ఒక్క వీరాయ కూలిచేస్తే గంపెడుగుంపు తినాలసి వచ్చింది.

అట్లాగే కష్టపడి జీవించుచున్నాడుగాని అతనిలో ఒక లోపమున్నది—రోజూ ఒక్క ఆసామీకే కూలికి వెళ్ళడు. ఎవరు పిలిస్తే వారికల్లా వెళ్ళేవాడేగాని ఖాయంలేదు. ఒకరికింద ఖాయంగా జీతగాడివలెవుంటే వారు చెప్పినట్టు వుండాలనీ, ఇట్లా వుంటే స్వేచ్ఛగా యిష్టం వచ్చినవారికి పని చెయవచ్చుననీ, కష్టంగావుంటే మానుకోవచ్చుననీ తలచేవాడు. అందుచేత యెవరికైనా సరే కూలికి వెళ్ళేవాడు—ఓపికలేనినాడు మానేసేవాడు.

... ... ...

గోరుచుట్టు మీద రోకటిపోటన్నట్టుగా, రోజు కూలియే చాలీచాలకుండా వుండే సంసారంలో, రోగాలు ప్రవేశించాయి. వీరాయ ఇంట్లో మశూచికం ప్రవేశించి, భార్యకూ, పిల్లలకూ సోకింది. వాడే పరిచర్యలూ, గంజికాచి ఇవ్వడం వల్లా, పనికి వెళ్ళటానికి వీలులేకుండా పోయింది.

... ... ...

ఇంట్లో గింజలులేవు. ఏ ఆసామీనైనా అప్పు అడిగితే యిస్తాడో లేదో అనే భయం—ఎట్లానైనా తప్పలేదు. ఇద్దరి ముగ్గురిని అడిగిచూచాడు. మా పనిలోకి ఖాయంగా రానివాడికి బాకీ యిస్తే యెట్లా అని సమాధానమిచ్చారు. ఈ సంగతి తనకు యిష్టం లేకపోయినా, చివరకు వారికి దాస్యం చేయాలనివచ్చింది. బాకీ తీరేనాటికి వారి పనికే వస్తానని వప్పందంచేసి చివరకు ఒక ఆసామీ వద్ద యిరవైరూపాయలు తెచ్చుకుని సంసారం జరుపుతున్నాడు.

... ... ...

నెలరోజులుకుగాని వ్యాధులు పోలేదు. ఒక్క రోజైనా కూలికి పోలేదు. ఇరవై రూపాయలు అయిపోయినాయి. ఇక ఏంచేస్తాడు. అలాగే ఆసామీ భద్రయ్యపనిలోకి పోనారంభించాడు. బాకీ తీరేదాకా పనికిపోక తప్పదు. మళ్ళీ నాలుగు రోజులైనాక బాకీ అడిగాడు. భద్రయ్య మండిపడ్డాడుగాని యేం చేస్తాడు? ఇరవై మానికల గింజలు తిరిగికొల్చాడు.

వీరడు హిందూమతములోనివాడే అవటంవల్ల యెందరో దేవతలకు ముడుపులు గట్టినాడు. తన సంసారంలో అంతా బాగా లేచి బయటపడితే చాలునని దేవుళ్ళకు మ్రొక్కులు మ్రొక్కుకున్నాడు. అల్లాగే జరిగింది.

... ... ...

అయితే బాకీ తీరేమార్గములేదు. సంవత్సరము పొడుగునా భద్రయ్య పనిలో వెళ్తుంటే, తెచ్చుకునే గింజలకూ చేసేపనికీ సరిపోతుందిగాని బాకీ అట్లాగే వడ్డీతో పెరుగుతున్నది. ఒకనాడు వీరాయ కొద్దిజ్వరం తగిలి పడియున్నాడు. పనికి రాలేదు. అవసరమైనపనిగా వుంది భద్రయ్యకు.

గబగబా మాలపల్లి వెళ్లి వీరాయను పనికి రాలేదని నానాతిట్లు తిట్టినాడు. వీరాయ కొంచెము మానుపస్తుడవటంవల్ల ఆ జ్వరంతోటే పనికివచ్చాడు. మర్నాడు యింకా జాస్తిగా వచ్చింది. అంచేత రాలేకపోయాడు. గాని యింట్లో గింజలులేవు. భద్రయ్య పాతబాకీ తీరందే నేను గింజలియ్య నన్నాడు. పనికిగూడా రానప్పుడిస్తాడా!

క్రైస్తవమిషన్ బోధకులు మాలపల్లి కారోజున వచ్చి లెక్చర్లిస్తున్నారు. వీరాయ భార్యపోయి అది విన్నది. వారి మతంలోకి వస్తే అప్పులిస్తామనీ, మందు లుచితంగా యిస్తామని, పొలాలు సర్కారువారికి చెప్పి యిప్పిస్తామనీ హిందూ మతంలోవుంటే మీరెట్టే సర్వకాలము బానిసగా వుండాలసివస్తుందనీ, మీకు సహాయం చేసేవాళ్లు లేరనీ ఆ ఉపన్యాసాల సారాంశము. ఇంకా మీ రాముడుకేన్నా కృష్ణుడికేన్నా క్రైస్తు మంచి వాడనీ—

ఈ మాటలు వీరాయకు కందినాయి. పాతఅప్పులకు యాభై రూపాయలు యిచ్చి, నాకు మందులిచ్చి బాగుచేస్తే, ఆ దేవుణ్ణే కొలుద్దాము కనుకో అన్నాడు జ్వరంలో వున్న వీరాయ. వీరాయభార్య పాదిరీలదగ్గరకుపోయి కనుక్కున్నది. తనసంసారంలోని యేడుగురూ కలుస్తామనీ, సొమ్ము, మందులూ పంపమనీ కోరింది—కొత్తగ్రామంలో ముందుగా యెవ్వరూ మతంలో జేరబడకుండా వున్నప్పుడు యిదే వుపాయమని ఆలోచించారు బోధకులు. చాటుగా వీరాయకు యాభైరూపాయలు యిచ్చారు. వాళ్ల కుటుంబం అంతా మతస్వీకారం చేశారు. క్రమంగా వాడి బంధువులు ఆ మతంలో దిగారు.

వీరాయ బాకీలు తీర్చేశాడు. మతబోధకుల సాయాన రోగంపోయింది. సర్కారువారికి దరఖాస్తు పెట్టాడు. రెండుయకరాలభూమి సంపాదించాడు.

... ... ...

ఇప్పుడు వీరాయపేరు జాను. జానంటే ఇప్పుడు అందరికీ యిష్టం. వాడు యీ భూమికితోడు ఆసామీలచేలు కొన్ని కవులుకు తీసుకున్నాడు. సర్కారిచ్చిన భూమిని చూచి, చాలామంది మా భూమి కవులు చేయి, మా భూమి కవులు చేయి అని అడిగే స్థితిలోవుంది జాను పని.

... ... ...

భద్రయ్యకు మాత్రం బాగా పనిచేసిపెట్టే నవుకరు పోయాడని చాలా విచారంగావుంది. బాకీ తీర్చటానికి పోయినప్పుడు అన్నాడు గదా—ఏమిరా యీరా! నీవు మన మతము వదలి క్రైస్తవుడవయ్యావట. ఈ మతములో నీకు యేం కష్టం కల్గింది? నేను మాత్రం నీకు అంత కావాలంటే డబ్బు బాకీ యియ్యకపోయానా యేమి? అని మాటలుకోటలు దాటుతాయి అన్నట్లుగా వుంది భద్రయ్య సంభాషణ.

అడిగినవాడు యిచ్చేక, యిప్పుడా అనే గాలి మాటలివి.

"ఏమో లెండి! క్రైస్తుదేవుడు మమ్ములను రక్షించాలని ఆ బోధకులను పంపాడు. ఆయన కటాక్షముంటే, నేను యిక యెవరిసాయము కోరను" అన్నాడు వీరాయ కాదు జాన్. భద్రయ్యకు యే నవుకరైనావుంటేగాని జరుగదు.

మాలపల్లిలో యెవరిని విచారించినా, చాలా భాగము క్రైస్తవులైపోయి భూములు సంపాదించుకున్నారు. అంచేత ఖాయంగా జీతానికిగాని, కూలికిగాని వచ్చేవారే లేరని తెలుసుకున్నాడు. ఎప్పుడో ఒకరోజు వస్తే యేం లాభం?......

ఈ కూలీలతోను, జీతగాండ్లతోను యిబ్బంది పడలేక విసిగివేసారి, భద్రయ్యగూడా పొలం పాలికి యివ్వాలసి వచ్చింది. తనకు నమ్మకమైన వాళ్లు యెవరూ కుదరక చివరకు వీరాయనే. కాదు జానునే, బతిమాలవలసిన స్థితి యేర్పడింది, కాలమెంతలో మారింది!

జాను యేదో సాకులుపెట్టి చివరకు మస్తాకొంచెము రాయితీగా యేర్పాటుచేసుకొని మళ్ళీ భద్ర

య్యగారి పొలము పనికి ప్రవేశించాడు గాని యిప్పుడా బానిసత్వముతో పొలములో ప్రవేశించలేదు. స్వేచ్ఛగా భూకామందువలె దానిలో దిగాడు.

అవసరాలకోసం వీరాయ జానుగా మారిపోయినా, అతనికి హిందూమతమంటే యింకా విశ్వాసమే. తనయింట్లో మశూచి వచ్చినప్పుడు హిందూమతంలోని దేవతలే రక్షించారని దృఢనమ్మకం-అందుచేత అతడు ప్రతి శివరాత్రికీ జాగరణచేసి, దేవుని కళ్యాణం చూచివస్తాడు. మతం గాని ఆ లో నున్నప్పుడుగానీ, యిప్పుడు జాన్ అయినాక గానీ ఆ దేవుని సన్నిధికి పోటానికి సాహసించటం లేదు. దూరంగావుండే మనస్సులో ధ్యానం చేసుకొని వస్తాడు-అల్లాగే క్రైస్తవగుడిలోకి పోయి, ప్రార్థన చేసుకొని వస్తాడు-అక్కడగూడా తనవంటి నేటీవులతో, పాశ్చాత్య క్రైస్తవులతో సమాన మర్యాదలు లేవని క్రమంగా గ్రహించాడుగూడా. అయినా అంతపాపం లేదు-హిందూమతంలోనున్న అంటరానితనంవంటి పెనుభూతాలు అందులో లేవని మాత్రం గ్రహించాడు. కాని పైకి ఆచారాదులలో ఎల్లావున్నా హిందూమతంలో గూడా సర్వేజనాస్సుఖినోభవంతు, అహింసా పరమోధర్మ మను బోధలవంటి బోధలు యున్నిమతాలు వెతికినా దొరకవేమోనని మాత్రం అనుకుంటూనే వుంటాడు-మతంలో వుండే మంచిని గ్రహించకపోయినా, ఆచరించకపోయినా మతస్థులను అనాలి గాని మతదోషం యేముంటుందని అతని యుద్దేశ్యము.

“నాకున్న కష్టమల్లా హిందూ మతములో బానిసత్వమొక్కటే-అది యీ మతములోకి వచ్చేసరికి పోయింది-నాకు కావలసింది అదే”అని జాన్ మతవిషయమైన సంభాషణ వచ్చినప్పుడల్లా అందరితో అనేవాడు కాని హిందూ క్రైస్తవ మతములకు సమానాధిక్యతలే లెక్కన విషయాలలో చూపెట్టేవాడు.




ఆరోగ్య జీవనము
మీ అందుబాటులోనే వుంది

మనం ప్రకృతికి దూరమౌతున్నాము
అటులనే ఆరోగ్యానికినీ

కాని, గృహిణి ఆరోగ్యము వుండనియెడల మొత్తము గృహమే అనారోగ్యమై అనాకారవంతమై వుంటుంది. స్త్రీ ఆరోగ్యమును ఏ పరిస్థితులందును కాపాడుకోవాలి. స్త్రీకి ఆరోగ్యజీవనము అందుబాటులోనే వుంది.

“ లోధ్ర ” స్త్రీలకు ఆరోగ్యజీవనమును ప్రసాదిస్తుంది. లోధ్ర సేవనము గర్భాశయ రోగములను నిర్మూలించి సౌందర్య సౌఖ్యజీవనమును ప్రసాదిస్తుంది.

సుదతుల సౌఖ్య సౌందర్య జీవనమునకు

# లోధ్ర

కేసరి కుటీరం లిమిటెడ్., మద్రాసు.

తెలుగుజిల్లాలకు, నైజాముకు ఏజెంట్లు,

సీతారాం జనరల్ స్టోర్సు, బెజవాడ.